విశాలాంధ్ర
శ్రీకాకుళం
సోమవారం 29, డిసెంబర్ 2025

కవిటి తీరంలో సందడే.. సందడి

విశాలాంధ్ర-కవిటి: ఈ ఏడాదికి చివరి ఆదివారం కావడంతో కవిటి బీచ్ సందర్శకులతో కళకళలాడింది. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి సందర్శకులు వచ్చి తీరంలో సందడి చేశారు. ఉదయం నుండి సందర్శకులు పిక్నిక్‌కి వచ్చి సరుగుడు తోటల్లో వంటలు చేసి భోజనాలు అనంతరం తీరంలో చేదతీరి, అలలతో అహ్లాదంగా గడిపారు.

శిథిలావస్థలో వంశధార, ఇరిగేషన్ కార్యాలయాలు

- నూతన కార్యాలయానికి నోచుకోని వంశధార
- ఆక్రమణకి గురవుతున్న వంశధార భూములు
- ఆక్రమణలను కూటమి ప్రభుత్వం కాపాడుతుందా...!
- కార్యాలయంలో విధులు నిర్వహించాలంటే భయం.. భయం...!
- నూతన కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం అడుగులు వేయాలని ప్రజల విజ్ఞప్తి

విశాలాంధ్ర-టెక్కలి: జిల్లాలో వంశధార ప్రాజెక్టు అత్యంత ప్రధాన సాగునీటి వనరు. వేలాది ఎకరాలను సస్యశ్యామలంగా చూసే ప్రముఖమైన ప్రాజెక్ట్ వంశధార ప్రాజెక్టు. రైతన్నలకు వంట సమయాలలో నీరును అందిస్తూ అనుక్షణం అండగా ఉండేదే వంశధార ప్రాజెక్టు. అయితే అలాంటి ప్రధానమైన వంశధార ప్రాజెక్ట్‌కి సంబంధించిన డివిజన్ వంశధార, ఇరిగేషన్ కార్యాలయాలు మాత్రం ఇప్పటివరకు శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం ప్రభుత్వాలు నిర్మించిన కార్యాలయాలే కనిపిస్తున్నాయి తప్ప.... నూతన కార్యాలయానికి ఏ ప్రభుత్వం వచ్చినా నోచుకోకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.



- వంశధార భూమి ఎంతో...అసౌకర్యాలు అంతా...

మండల కేంద్రంలోని స్థానిక తెంబూర్ రోడ్డుకి ఆనుకొని సుమారుగా 11 నుండి 12 ఎకరాల వంశధార ప్రాజెక్టుకి సంబంధించిన విశాలమైన భూ భాగంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అభివృద్ధి మాత్రం అంతంత మాత్రేంగే కనిపిస్తున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ఆ స్థలంలో కొన్ని ప్రభుత్వాలు వచ్చే సమయంలో కొన్ని మార్పులు చేస్తూ ప్రజలకు ఉపయోగపడే కొన్ని వ్యవస్థలను తెచ్చి పెడుతున్నాయి. మరి ఇంత వ్యవస్థ ఉన్న టెక్కలి వంశధారకి సంబంధించిన డివిజన్ స్థాయి బిఆర్ఆర్ ప్రధాన వంశధార ప్రాజెక్ట్ ప్రధాన కాలువ విభాగం, ప్రధాన కాలువ సబ్ డివిజన్ కార్యాలయం, మెయింటెనెన్స్ సబ్ డివిజన్ కార్యాలయం నరసన్నపేట మరియు జల వనరుల శాఖా పరిధిలో నీటిపారుదల ఉప విభాగ కార్యాలయం, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ సెక్షన్ కార్యాలయం, ప్రత్యేక పరిశోధన ఉప విభాగ కార్యాలయాలతో పాటు ఇలా మరెన్నో కార్యాలయాలు మాత్రం శిథిలా వ్యవస్థలోనే కొనసాగుతున్నాయి. ఆ కార్యాలయాలలో పై స్లాబ్ పెచ్చులు ఊడుతూ కింద కూర్చున్న అధికారులపై పడే సందర్భాలు ఎన్నో ఉన్నాయంట. వర్షాకాలం వస్తే కార్యాలయంలో ఉన్న రికార్డులుకు రక్షణ లేక, సిబ్బందికి రక్షణ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంట. ఆ కార్యాలయంలో విధులు నిర్వహించాలంటే ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో అని బిక్కుబిక్కుమంటూ భయంతో విధులు నిర్వహిస్తున్నారు అంటూ కార్యాలయానికి వెళ్ళిన ప్రజలు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వానికి మరియు మంత్రులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందించిన చూస్తాం చేస్తాం అంటున్నారంట. దీంతో అధికారులు కూడా తమ విధులు చేసుకుంటూ వెళ్లిపోతే సరిపోతుంది అని అనుకుంటున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇరిగేషన్ కి సంబంధించిన కార్యాలయాలు 2001 నుండి అనేక ప్రదేశాలలో మార్పులు చేస్తూ ఇప్పుడు అదే శిథిలా వ్యవస్థలో ఉన్న కార్యాలయంలోకి చేరింది. ఆ కార్యాలయానికి ఇదివరకే రెండుసార్లు స్థలం కేటాయించినప్పటికీ ప్రభుత్వాలు మరియు అధికారులు మారడంతో అవి అలానే ఉండిపోయాయంటూ తెలుస్తోంది.

కొంతకాలం ఈ కార్యాలయాలు అద్దెలు ఉన్న ఇళ్లల్లోకి మార్చినప్పటికీ ప్రభుత్వం సరైన సమయానికి అద్ది చెల్లించకపోవడంతో వేరే దిక్కు లేక మరల అదే శిథిలా వ్యవస్థలో ఉన్న కార్యాలయాలలోకే చేరవలసిన పరిస్థితి నెలకొన్నట్లు కనిపిస్తుంది. అయితే ప్రస్తుతం ఉన్న వంశధార స్థలాలపై ఎన్నో సంవత్సరాలుగా రక్షణ లేకుండా ఆక్రమాణాలకు గురవుతూ వస్తున్నాయి. కొన్ని సంవత్సరాల ముందు అదే స్థలములో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సుమారు ఐదు ఎకరాల స్థలములో నిర్మాణం చేపట్టి ఎంతోమంది ప్రాణాలను కాపాడుతూ వారి జీవితాలలో టిడిపి ప్రభుత్వం వెలుగును నింపుతున్నాయి. మిగిలిన ఆ చుట్టుపక్కల భూములను ఆక్రమణానికి గురవుతున్నట్లు గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి.

వంశధార స్థలం అక్రమానికి గురవుతుందంటూ విమర్శలు

ఈ మధ్యకాలంలో కొంతమంది ఆ వంశధార స్థలంపై కన్ను వేస్తూ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న సమయాలలో చూసి ఆ స్థలాలు ఆక్రమానికి గురి చేస్తున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత వ్యవస్థ ఉన్న వంశధార కార్యాలయాలు మాత్రం శిథిలా వ్యవస్థలోనే ఉన్నాయి. రైతన్నలకు వెన్నుముకగా ఉన్న వంశధార, ఇరిగేషన్ వ్యవస్థకు ఇప్పటికైనా స్పందించి మండల కేంద్రంలో నూతన కార్యాలయాల నిర్మాణముకు, ఖాళీగా ఉన్న భూమిని రక్షిస్తూ ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలని అదే చోట నిర్మించేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

గ్రామాలకు పక్కా రోడ్లు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - కొత్తూరు: కొత్తూరు మండలంలో లబ్బ రోడ్, నివగాం నుండి పాతపాడు రోడ్ వేయాలని నివగాం, ఇరపాడు, కోయిలాపు ప్రాంతాలకు చెందిన టీడీపీ నేతలు కోయిలాపు సంజీవరావు, బిల్లింగి సంజీవ్‌రావు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతి పత్రం అందజేశారు. వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్‌రావు కూడా లబ్బా, పాత పాడు గ్రామాలకు రోడ్లు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సానుకూలంగా స్పందిస్తూ ఐటీడీఏ పిఓతో ఫోన్‌లో మాట్లాడి వీలైనంత త్వరగా రోడ్ పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోయిలాపు శ్రీనివాస్‌రావు, యడ్ల గోపి, యువనాయకులు చోడవరపు జ్ఞానేశ్వరరావు, బూరాడ కమలహాసన్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి గ్రామంలో ఆదివారం పద్మశాలి సంఘం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఆ కులం నుంచి నూతనంగా సంతబొమ్మాళి మండలం పిఎసిఎస్ చైర్మన్‌గా ఎన్నికైన కూచెట్టి కాంతారావును ఆ సంఘ నాయకులు, ప్రముఖులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కులంలో ఉన్నత పదవులు పొందిన వారికి సన్మానం చేశారు. కులం ఐకమత్యం అభివృద్ధి కోసం చర్చిం చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. సుమారు 3000 మంది కలయికలో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో యువత నాయకులు కూచెట్టి భాను ప్రకాష్, పప్పు కృష్ణారావు, కూచెట్టి కృష్ణారావు, కానూరి ఆనందరావు, దూబ శంకర్, మొండి రాము, దూబ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

విశాలాంధ్ర - సోంపేట: క్రిస్మస్ సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు తండ్రితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఓ లారీ జాతీయ రహదారిపై మృత్యువు రూపంలో ఆ విద్యార్థిని కబలించిన సంఘటన కంచిలి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సోంపేట మండలం పోత్రకొండ గ్రామానికి చెందిన మట్ట హేమంత్ సరస్వతి దంపతుల కుమారుడు మట్ట ప్రణీత్ కుమార్ కంచిలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. ఇటీవల క్రిస్మస్ సెలవులకు పాఠశాల నుండి ఇంటికి వెళ్లిన ప్రణీత్ ను పాఠశాలలో దించేందుకు తండ్రి తన బైక్‌పై తీసుకు వెళుతుండగా జలంత్రకోట సమీపంలో ఓ లారీ ఢీకొనడంతో ప్రణీత్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి హేమంత్ తీవ్ర గాయాలతో సోంపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కంచిలి పోలీసులు రెవెన్యూ సిబ్బంది పంచనామా నిర్వహించి సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్ట్ మార్టం పూర్తి చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు ఆదర్శనీయం

మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ అశోక్

విశాలాంధ్ర-సోంపేట: సమాజం మనకేమి ఇచ్చింది అని కాకుండా, సమాజానికి మన వంతు సేవ చేయాలని దృక్పథంతో సోంపేట బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు చేసిన సేవలు ఎంతో మందికి ఆదర్శనీయమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. బాలుర ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ విద్యార్థులు

ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని గాంధీ మండపం జంక్షన్ వద్ద నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమ్మేళనం అంటే పార్టీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అనుకునే వారికి ఈ కార్యక్రమం ఒక మంచి ఆదర్శనీయమన్నారు. సమాజానికి మన వంతు సేవ చేయాలని సంకల్పంతో పాటు గురువులను గౌరవించడం మంచి పరిణామం అన్నారు. ప్రతి ఒక్కరు ఇటువంటి ఆలోచనలతో సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. నిరుపేదలకు వైద్యాన్ని దగ్గర చేసి సేవలందించడం ఎంత అభినందనీయమన్నారు. సందర్భంగా పట్టణానికి చెందిన భోగి వెంకట మాణిక్యం, తుంగాన వెంకటేష్, ఫణీంద్ర, కూన నాగేంద్ర, చింతల సాయిరాజ్ తోపాటు శ్రీకాకుళం మెడికవర్ వైద్యులు పాల్గొని సేవలందించారు.

ఎస్వీఎస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: శ్రీకాకుళం జిల్లా అరసవల్లి వాడాడ గ్రామపంచాయతీలో గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మైదానంలో (ఆదివారం, సోమవారం) రెండు రోజులుగా నిర్వహిస్తున్న రెండవ స్టేట్ ఇంటర్ విద్యార్థుల పెన్ కాక్ సిలెట్ (మార్షల్ ఆర్ట్స్) పోటీలలో కట్టాస్, టాండింగ్, రేగు విభాగాలలో ఎస్వీఎస్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. గోల్డ్ మెడల్లో ఐదుగురు, సిల్వర్ మెడల్ నలుగురు బ్రాంజ్ మెడల్ ఐదుగురు విద్యార్థులు సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు నలుగురు (రొంగల రష్మిక గౌతమి, జరుగుళ్ల నిహారిక, లింగాల నిత్యశ్రీ, పొట్నూరు హరిణి), సిల్వర్ మెడల్ నలుగురు సాధించారు (వైష్ణవి, జరుగుల్ల రోహిత్, మెండ హర్షిని, బోర తరుణ్ తేజ్), బ్రాంజ్ మెడల్ ఐదుగురు సాధించారు(జయ కృష్ణ, లక్కీ, జేమ్స్ రోహన్,పిలక హర్షవర్ధన్, బస రేవంత్ రెడ్డి) ఈ విజయం పట్ల డైరెక్టర్ విజయ్ కరస్పాండెంట్ ఉపాధ్యాయులు హర్షం శీంటవ్వరు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - ఎల్.ఎన్.పేట: దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు సామాజిక వేత్త గురు దేవా ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, సక్షం జిల్లా కన్వీనర్ బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పిపిఎవి మండల గౌరవ అధ్యక్షులు లయన్ డా.ఎం.కె.మిత్రో వృద్ధాశ్రమంలో ఉచితంగా పండ్లను పంపిణీ చేశారు. హిరమండలంలో గల శ్రీ ప్రేమ సాయి వృద్ధాశ్రమంలో ఉచితంగా పండ్లను వృద్ధులకు అందచేయుటకు గాను ఆశ్రమ మేనేజర్ నర్సింహామూర్తికి అందజేశారు.

గ్రామాభివృద్ధి కోసమే పల్లె పండుగ

టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత

విశాలాంధ్ర-రణస్థలం: గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని అమలు చేసిందని రాష్ట్ర తెదేపా మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. ఆదివారం లావేరు 3 తాళ్లవలసలో పల్లెపండగ 2.0 కార్యక్రమం ద్వారా రూ 1.15 లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్లును ఆమె టీడీపీ మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం పాడి రైతులకు ఎంతగానో ఉపయోగపడ ుతుందన్నారు. రెండు ఆవులకు రూ 1 .15 లక్షలు, నాలుగు ఆవులకు రూ 1.85 లక్షలు, ఆరు ఆవులకు రూ 2 లక్షలు చప్పున జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అప్పాపురంలో మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్ ప్రారంభించారు. బొంతుపేట, లావేరు గ్రామాల్లోను నాలుగు గోకులం షెడ్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ రెడ్డి సత్యవతి, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ మోహన్, టిఏ వెంకటరమణ, ఆకుల అప్పలనాయుడు, బాసిన దాలిరాజు, నార తౌడు, సంతోష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర-గార: పట్టణాలకు దీటుగా, ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, చేసి చూపిస్తున్నామని, ప్రతీ గ్రామం "సుందర గ్రామమే" కూటమి ధ్యేయమని కేంద్ర పౌరవిమానయాన శాఖా మాత్యులు కింజరాపు. రామ్మోహన్ నాయుడు అన్నారు. గార మండలం బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ 15 ఫైనాన్స్ కమీసన్ నుండి రూ.50 లక్షల విలువగల వైద్యశాలను, శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేపిహెచ్విబి నుండి 260 లక్షల విలువగల బాలికల హాస్టల్, శ్రీకాకుళం స్థానిక ఎల్బిఎస్ కాలనీ పద్మావతి నగర్‌లో, హెచ్‌ఎంసియే, మున్సిపల్ కార్పొరేషన్ నుండి సుమారు 19 లక్షల సిసి రోడ్డు, ఎంపిడివో కార్యాలయ సుమారు 34 లక్షల సిసి రోడ్‌లను నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్‌తో కలసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారాలతో రాష్ట్రాన్ని సుపరిపాలన దిశగా, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు చొరవతో, నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్, శ్రీకాకుళాన్ని ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారన్నారు. గొండు శంకర్ ప్రజాసేవకునిగా, నిరంతరం శ్రమిస్తూ నగర ప్రజలకే పరిమితం కాకుండా, జిల్లా వ్యాప్తంగా కుటుంబ సభ్యునిగా మారి పోయారని, ఆయన చేస్తున్న సేవలు, అభివృ ద్ధితోనే ఈ స్థాయికి చేరుకున్నారన్నారు. ప్రారంభోత్సవ కార్యక్ర మంలో జిల్లా వైద్యాశాఖాధికారి అనిత, మండల, నగర టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, మండల, నగర పరిధి ప్రజలు, మహిళా నాయకులు, వైద్య, సచివాలయ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏడు రోజులపాటు రథసప్తమి వేడుకలు

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రసిద్ధ సూర్య దేవాలయం శ్రీకాకుళం జిల్లా అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో ప్రధాన వార్షిక ఉత్సవం రథసప్తమిని అంగరంగవైభవంగా జరిపేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలసి ఆయన క్యాంప్ కార్యాలయంలో రథసప్తమి ఏర్పాట్లపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి, సంయుక్త కలెక్టర్ ఫార్మాన్ అహ్మద్ ఖాన్ లతో సమీక్షించారు. జనవరి 25వ తేదీన రథసప్తమి జరుగుతూ ఉండగా.. అందుకు వారం రోజుల ముందు నుండి ఈ ఉత్సవాలు జరిగే విధంగా ఏర్పాటు ఉండాలని సూచించారు. 19వ తేదీన ఉత్సవాలు మొదలు కావాలని, ఆఖరి మూడు రోజులైన 23, 24, 25 తేదీలు మరింత అట్టహాసంగా జరగాలని తెలిపారు. ఈ ఉత్సవాలలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, క్రీడా, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను భాగస్వామ్యం చెయ్యాలని కోరారు. ఉత్సవాల ఆహ్వాన పత్రిక మొదలుకొని అన్నీ నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం జరగాలని, దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రముఖులకు ఆహ్వానాలు పంపాలని కోరారు. ఉత్సవ నిర్వ హణ పై పూర్తి నివేదిక సిద్ధం చేసిన తరువాత మరోసారి సమీక్షించి తుది నిర్ణయం తీసుకోనున్నట్టు స్పష్టం చేశారు.

నిరంతరం చెస్ క్రీడ సాధనతో మెదడుకు మేత

- శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు డా. గంజి ఆర్ ఎజ్రా
- ఉత్సాహంగా క్రిస్మస్ ఫెస్టివల్ ఓపెన్ చెస్ టోర్నీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నిరంతరం చెస్ క్రీడ సాధనతో మెదడు పదునెక్కుతుందని, తద్వారా చదువులో కూడా రాణించడానికి ఉపయోగపడుతుందని శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు, దామోదర్ సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు ప్రెసిడెంటు డా.గంజి ఆర్ ఎజ్రా తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం ప్రాంతంలో గల తిలక్నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీలో క్రిస్మస్ పెస్టివల్ ను పురస్కరించుకుని 209 వ చెస్ టోర్నీ ను ఉత్సాహంగా నిర్వహించారు. 5 రౌండ్లపాటు జరిగిన చెస్ పోటీలలో చెస్ క్రీడాకారులు అసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంజి ఆర్ ఎజ్రా మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధావుల క్రీడ అని అలాంటి క్రీడలో జిల్లా చిన్నారులు పాల్గొని చెస్ ను నేర్చుకోవడం, పోటీలలో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గంజి ఆర్ ఎజ్రా దంపతులు క్రిస్మస్ పండగ విశేషాలను, చదువు, క్రీడల ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం విజేతలకు మెడల్స్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిడే రేటింగ్ చెస్ ప్లేయర్, స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ కోచ్ భేరి చిన్నారావు, చెస్ కోచ్ కె.సాయి నిరంజన్ సింగ్, చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొందూరు ఖాదీని విశ్వవ్యాప్తం చేద్దాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రపంచ ఖ్యాతిని ఆర్జించిన పొందూరు ఖాదీని మళ్ళీ ప్రాచుర్యంలోకి తీసుకురావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం సభ్యులు, స్థానిక టీడీపీ నేతలు, పొందూరు ఖాదీ కార్మికులు మర్యాదపూర్వకంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. తమ ఖాదీలో నకిలీల బెడద అరికట్టే విధంగా, పొందూరు ఖాదీకి విలువ పెంచే విధంగా జి.ఐ ట్యాగ్ మంజూరుకు కృషి చెందినందుకు ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దాల తమ కష్టాన్ని తొలగించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ.. ఇదే తోడ్పాటు భవిష్యత్‌లో కూడా అందివ్వాలని కోరారు. దీనిపై రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ నేతన్నల తోడ్పాటుతో మళ్ళీ పొందూరు ఖాదీని విశ్వవ్యాప్తం చేద్దామని, జి.ఐ ట్యాగ్‌తో పూర్వ వైభవం సాధించడం సులభం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొందూరు పట్టణ అధ్యక్షుడు శ్రీరంగ నాయకులు టిడిపి నేత దండా రవికుమార్, ఆంధ్ర ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం అధ్యక్షులు గొంటుకు కామేశ్వర ప్రసాద్, కార్యదర్శి దండా వెంకటరమణ, ఉపాధ్యక్షులు కొండల రావు, కార్యవర్గ సభ్యులు, ఖాదీ కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా కళింగ సామాజిక వర్గ ఆత్మీయ కలయిక

- భారీగా తరలి వచ్చిన ప్రజలు

విశాలాంధ్ర -ఎచ్చెర్ల: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చౌదరి సత్యన్నారాయణ తోటలో ఆదివారం కళింగ సామాజిక వర్గ ఆత్మీకలయిక సమావేశం వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన జిల్లాతోపాటు, ఇతర జిల్లా, రాష్ట్రాల్లో ఉన్న సామాజిక వర్గంకు చెందిన వారంతా ఈ కార్యక్రమానికి హాజరై సందడిగా గడిపారు. కళింగ సామాజిక వర్గం సంక్షేమం కోసం, అభివృద్ధి, హక్కుల కోసం అంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఉన్నతస్థాయికి చేరుకున్న వారు మిగిలిన వారికి చేయూత నిచ్చి కలసి మెలిసి ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. కళింగ సామాజిక వర్గ అభివృద్ధి. ఐక్యతా చాటుతూ నినాదాలు పాటలు పాడారు. గడిచిన 15 రోజులనుంచి కళింగ సంక్షేమ సంఘం నేతలు దువ్వల వెంకటరావు, దానేటి శ్రీధర్, చెల్లయ్య, చింతాడ రామ్మోహన్ తదితరలు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 20 నుంచి 25వేలు జనాభా హాజరవుతారని అంచనాలు వేశామని, అయితే సామాజిక వర్గంకు చెందిన 40వేలకు పైగా ప్రజలు హాజరయ్యారని తెలిపారు. కళింగ సామాజిక వర్గానికి గాయకుడు ధనుంజయ్ పాటలతో అలరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి విశ్రాంత ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ చైర్మన్, జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు, ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎంఎల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కూన రామ్జీ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్ తెదేపా జిల్లాపార్టీ అధ్యక్షుడు మొదలవలస రమేష్ పూర్వ జిల్లా పార్టీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మాజీ కేంద్రసహాయ మంత్రి కిల్లి కృపారాణి, సామాజిక వర్గ ప్రముఖులు పేడాడ తిలక్, తదితరులు హాజరయ్యారు.

అందరినీ కూడ గట్టేదే ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర–కోటబొమ్మాళి: కులంలో అందరిని కూడగట్టేదూ ఆత్మీయ కలయిక అని పలువురు తెలగ సంఘం నేతలు అన్నారు. ఆదివారం కోటబొమ్మాళిలో తెలగ సంక్షేమ సంఘం వన సమారాధన (ఆత్మీయ సమ్మేళనం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా తెలగ కులస్తుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి పునాదులు వేసుకోవచ్చని అన్నారు. వెనకబడిన కులాన్ని ముందుకు నడిపించేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని రాజకీయంగా, సామాజికంగా బల్పడే విధంగా ప్రణాళికలు రూపొందించుకుందామని వారు తెలిపారు. కార్యక్రమంలో కులం నేతలు పల్లంట్ల వెంకట రామారావు, రొక్కం మధుబాబు, నాళ్ల ఆదినారాయణ, (చిన్ని) దాసరి మోహన్ రావు, రొక్కం రమేష్, దాసరి లక్ష్మణరావు, లాలిసెట్టి గోవిందరావు, ఎర్నాగుల వాసుదేవరావు,మండపాక నర్సింగరావు, గొంటి నాగభూషణరావు, నాళ్ల ప్రకాశరావు, రొక్కం నీలకంటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా,కొరవే,పురస్కారాల ప్రదానోత్సవం

కొత్తూరు రచయితల వేదిక సన్మానం

విశాలాంధ్ర –కొత్తూరు : కొత్తూరు రచయితల వేదిక(కొరవే) ఆధ్వర్యంలో ఆదివారం పలువురు ప్రముఖులను కొరవే పురస్కారాలతో సత్కరించింది వేదిక అధ్యక్షులు కలమట శ్రీరాములు ఆధ్వర్యంలో . స్థానిక విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల ఆవరణలో కొత్తూరు రచయితల వేదిక తొమ్మిదో నెల సమావేశంలో ఈ పురస్కార ప్రదానం చేసారు తొలుత వేదిక సహకార్యదర్శి గడసాపు ఉషారాణి స్వాగతవచనములు పలుకగా, ఉపాధ్యక్షులు శంకరరావు ప్రార్ధనా గీతాన్ని ఆలపించగా కార్యక్రమం ప్రారంభమైంది. వేదిక ప్రధాన కార్యదర్శి అమ్మల కామేశ్వరి జ్యోతి ప్రజ్వలన గావించారు. వేదిక సభ్యులు గేదెల మన్మధరావు మాట్లాడుతూ వచ్చే నెల మూడవ తేదీ నుంచి గుంటూరులో మూడు రోజుల పాటు జరుగనున్న ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఈ కొరవే పురస్కారాలను అందజేయుచున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యా కమిటీ ఛైర్మన్ లోతుగడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు తాతబాబు మాట్లాడుతూ సాహిత్యమనేది సమాజంలో నైతిక విలువలకు కట్టుబడి ఉంటుందని, తరతరాల సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకై పరితపిస్తుందని అన్నారు. కొత్తూరు రచయితల వేదిక సభ్యులు ఆ దిశగా కృషి చేయుట మిక్కిలి అభినందనీయమని అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో చిత్తశుద్ధితో కృషి చేస్తున్న పలువురు ప్రముఖులను కొరవే పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక రంగంలో పెద్దిన కులశేఖర ఆల్వార్, సేవారంగంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత రామరాజు ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు, పౌరాణిక రంగంలో వైశ్యరాజు వెంకటరాజు గుప్తా, కళారంగంలో పేడాడ గురుమూర్తి, జానపద రంగంలో బలగ హరిప్రసాదరావు, విద్యా రంగంలో సల్ల మన్మధరావు, వైద్య రంగంలో ఇప్పిలి జానకిరామయ్య, సామాజిక సేవారంగంలో పొగిరి రవి లను శాలువా, జ్ఞాపిక, సన్మానపత్రం,

నగదు పారితోషికాలతో కొరవే పురస్కారాలను ప్రదానం చేస్తూ వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. సభ్యులు ఎవిఆర్ఎం దిలీప్ రాజా పట్నాయక్ రచించిన సన్మానపత్రాలను వినిపించి బహూకరించారు. అనంతరం వేదిక సభ్యులు పల్ల నారాయణరావు సమన్వయంతో కవిసమ్మేళనం జరిగింది. వేదిక అధ్యక్షులు కలమట శ్రీరాములు, ఉపాధ్యక్షులు ముదిల శంకరరావు, ప్రధాన కార్యదర్శి అమ్మల కామేశ్వరి, సహకార్యదర్శి గడసాపు ఉషారాణి, సభ్యులు ఎవిఆర్ఎం దిలీప్ రాజా పట్నాయక్, గేదెల మన్మధరావు, పి.నారాయణరావు, బాణాన రమణమూర్తి తదితరులు కవితలు వినిపించి సభాసదుల ప్రశంసలు పొందారు.

జిల్లాస్థాయి ఒడియా ప్రతిభా పరీక్ష విజయవంతం

విశాలాంధ్ర–సోంపేట: సోంపేట ప్రభుత్వ మరియు బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) అధ్వర్యంలో ఒడియా గణిత ఉపాధ్యాయుల సహకారంతో జిల్లా స్థాయి ఒడియా గణిత ప్రతిభా పరీక్షలు ఆదివారం విజయవంతంగా నిర్వహించారు . ఈ కార్యక్రమాని ఉత్తరాంధ్ర ఒడియా డి.ఐ. డి.పి.చౌధురి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒడియా డి.ఐ. మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు నిర్వహించడం వలన పోటీ పరీక్షల పై పిల్లల్లో అవగహన పెరుగుతుందని అన్నారు.ఆపోటా సభ్యులు ప్రమోద్ కుమార్ పాఢీ,మురళీ దోళాయి,పురంద్ర బిసాయి,సుదామ్ నాయక్ పర్యవేక్షణలో జరిగింది.ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) అధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్షకు అనూహ్య స్పందన లభించింది.జిల్లాలోని పదమూడు మండలల్లో చదువుతున్న ఒడియా పిల్లలు జరిగిన ప్రతిభా పోటీల్లో 650 మంది 8,9 మరియు 10 వ తరగతి చదువుతున్న ఒడియా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభాను కనవరిచారు.ఇలాంటి ప్రతిభా పరీక్షలు నిర్వహించడం పట్ల విద్యార్థుల తలిదండ్రులు సంతోషం వ్యక్త పరిచారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇలాంటి ప్రతిభా వెలికితీత పరీక్షలు విద్యార్థులకు చాలా అవసరమని ఆపోటా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ పాఢీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ అధ్యక్షుడు సత్య నారాయణ పాఢీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో చదువుతున్న ఒడియా విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు ఇలాంటి ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ కృషికి అభినందనలు తెలిపారు. వాస్తవంగా రాష్ట్రం ల్లో ఒడియా మాధ్యమం చదువుతున్న విద్యార్థులు తమ మాతృభాషలో పోటీ పరీక్షలు రాసుకునే అవకాశం లేదు కనుక ఇలాంటి పరీక్షలు పిల్లల బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాల్గోన్న ఇచ్ఛాపురం బాపుజీ ఒడియా పాఠాగార్ అధ్యక్షుడు రఘునాథ గౌడ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒడియా మాధ్యమంలో పిల్లలను జాయిన్ చేయాలని , ఒడియా మాధ్యమంలో చదివిన చాలమంది పిల్లలు ఉద్యోగాలు పొందారని,మాతృభాషలో చదవడం వలన జ్ఞానం సహజంగా పొందగలరని చెప్పారు.ఆపోటా మండల శాఖ ఉపాధ్యక్షుడు పురంద్ర బిసాయి కార్యదర్శి వైష్ణవ సాహు మాట్లాడుతూ

సోంపేట ,కంచిలి మరియు కవిటి మండలానికి చెందిన 190 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. నేటి కార్యక్రమం విజయవంతానికి సహకారించిన మండల ఉపాధ్యాయ ఉపాధ్యాయినులు విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఒడియా డి. ఐ. దుర్గా ప్రసాద్ చౌధురి,ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢీ ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రా అధ్యక్షప్రధాన కార్యదర్శులు భాస్కర్ పాఢీ,బృందావన్ దోళాయి, ప్రమోద్ కుమార్ పాఢీ,మురళీ దోళాయి,సుదామ్ నాయక్, ప్రదీప్ మండల్,శరత్ చంద్ర ,దుర్యోధన బెహెరా, నరేంద్ర,గోపినాథ్ ,రవీంద్ర, సత్యనారాయణ,జ్యోతిర్మయి భెసి.కృష్ణమూర్తి మండల శాఖ ఉపాధ్యక్షుడు పురంద్ర బిసాయి కార్యదర్శి వైష్ణవ సాహు మండల ఒడియా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశా

బిల్లుమాడా సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ

విశాలాంధ్ర – సీతంపేట / కొత్తూరు: గత ఇదేళ్ళు గా తమ పంచాయతీ ని సాధ్యమైనంత వరకు అన్ని విధలా అభి వృద్ధి చేసాము అని బిల్లుమాడా సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ అన్నారు శత శాతం విధి రోడ్లు సిమ్మెంట్ రోడ్లు గా నిర్మించాము , డ్రైన్స్ నిర్మాణం..,శివాలయం వరకు సిమ్మెంట్ రోడ్డు నిర్మాణం గ్రామం లో మొత్తం. మినీ వాటర్ ట్యాంక్ లు ఏర్పాటు. ఇంటింటికీ జలజీవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కొళాయిలు. నిర్మాణం దశ లో ఉన్నాయి అని అన్నారు . బిల్లుమాడ గ్రా మా. ప్రధాన రహదారి సిమ్మెంట్ రోడ్డు నిర్మాణం. బిల్లుమాడ నుండి బిల్లుమాడ కాలనీ రహదారి గుండా విద్యుత్ లైట్స్ ఏర్పాటు కు ప్రతి పాదనలు సిద్ధం చేసాం సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందె టట్లు లబ్ధిదారులు కు సహకరిస్తూ న్నాం అని సర్పంచ్ రాధా కృష్ణ అన్నారు

ఒడియా బ్రాహ్మణులంతా సంఘటితం కావాలి

విశాలాంధ్ర–మందస: పలాస నియోజకవర్గంలో గల ఒడియా బ్రాహ్మణులంతా సంఘటితం కావాలని బ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన జై జగన్నాథ ఒడియా బ్రాహ్మణ సంఘ సభ్యులంతా మందస మండలం భేతాళపురంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జై జగన్నాథ ఒడియా బ్రాహ్మణ సంఘ అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్ త్యాడి బాబురావు పాండాలు మాట్లాడుతూ సంఘంలో బ్రాహ్మణ సంఘ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని దీనికి ప్రతి ఒక్కరు సహకారం అవసరమన్నారు. రానున్న కాలంలో బ్రాహ్మణ సంఘ అభివృద్ధికి ప్రణాళికలు చేపడుతున్నామని సంఘంలో సభ్యులకు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం సంఘ సమస్యలపై చర్చలు జరిపారు సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఆటపాట మనోవికాస కథలు గేమ్స్ తో వనభోజన కార్యక్రమం సాగింది. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాఘవ పండా శశికుమార్ బ్రహ్మ సంతోష్ కుమార్ మనోజ్ కుమార్ పండా దేవేంద్ర రాముకొండ సూర్యనారాయణ పండా సంతోష్ త్యాడి పూజారి రవి నారాయణ పద్ద మహిళలు పాల్గొన్నారు.

చోరీకి గురి అయిన సెల్ ఫోన్ ను బాధితుడికి అప్పగింత

విశాలాంధ్ర–పలాస: కాశీబుగ్గకు చెందిన న్యాయవాది, పలాస బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్(గని) కి సంబంధించిన ఐ క్యు మొబైల్ ఫోను ను ఆదివారం విజయనగరం రైల్వే జి. ఆర్. పి. పోలీసులు బాధితుడు కు అందజేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఫయాజ్ అహ్మద్ విజయనగరం రైల్వేస్టేషన్ లో బుకింగ్ కౌంటర్ వద్ద టికెట్ లు కోనుగోలు చేస్తున్న సమయంలో ఐ క్యూ మొబైల్ ఫోన్ దొంగతనం జరిగింది. ఈ సంఘటనపై బాధితుడు జి. ఆర్. పి. పోలీసులకు పిర్యాదు చేయటంతో అప్పటి నుండి క్రైమ్ పోలీసులు రామకృష్ణ, మురళీ,ఆదినారాయణలు విశాఖపట్నం రైల్వే జి. ఆర్. పి. సి. ఐ. ఎ. రవి కుమార్ , విజయనగరం రైల్వే జి ఆర్. పి. ఎస్. ఐ. బాలజీ సహకారంతో సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని ఆదివారం విజయనగరం రైల్వేస్టేషన్ లో బాధితుడైన ఎండీ. ఫయాజ్ అహ్మద్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.బాలజీ మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులు రైలులో పోగొట్టుకున్న విలువైన వస్తువులకు సబంధించి బాధితులు ఇచ్చిన పిర్యాదులపై క్రైమ్ పోలీసులు ఎన్నో కష్టాలు కోర్చి చోరీకి పాల్పడిన వారిని పట్టుకొని వారి వద్ద ఉన్న సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేస్తున్నామని అన్నారు. అలాగని రైల్వే ప్రయణీకులు రైలులో ప్రయాణం చేస్తున్న సమయంలో తమ వస్తువులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైల్వేస్టేషన్ లో జి, ఆర్. పి. పోలీసులు చేస్తున్న సేవలు పట్ల ప్రయాణీకులు కూడా సహకరించాలని ఎస్సై కోరారు. తాను పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను తిరిగి తనకు ఇప్పించినందుకు విజయనగరం జి. ఆర్. పి. పోలీసులకు ఫయాజ్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

అధికారానికి యాదవులు దూరం..ఎన్నికల్లో ఓటు బ్యాంకుకే పరిమితం..!

విశాలాంధ్ర–పలాస: యాదవులు ఒక అణగారిన వర్గం.. ఒక పెద్ద సామాజిక వర్గంతో పాటు అనేక రాజకీయ పార్టీలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నన ఈ కులానికి అధికార పీఠం అందనంత దూరమే. అనేకమంది నాయకులను అందించడమే కాక ఎంతో చారిత్రిక నేపథ్యం కలిగిన యాదవ సామాజిక వర్గం ఆంధ్రప్రదేశ్ విషయంలో యాదవుల రాజకీయ స్థితిగతులు మిశ్రమంగా ఉన్నాయి. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో ఎక్కువగా కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య కులాల చుట్టూ తిరిగేవి. తర్వాత ఆ స్థానంలో కాపు సామాజిక వర్గం వచ్చి చేరింది. తాజాగా వీటి సరసన మరొక సామాజిక వర్గం వచ్చి చేరడం అనివార్యంగా మారింది. అదే యాదవ సామాజిక వర్గం. కులాల ప్రస్తావన లేకుండా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ఊహించలేం. ప్రస్తుతం రెండు మూడు పార్టీలు బలంగా ఉన్నట్లు కనిపించడానికి కారణం.. ఆయా పార్టీల వెనుక ఏదో ఒక కులం వెన్నుదన్నుగా నిలవడమే. ప్రతి నియోజకవర్గంలో గణనీయంగా బీసీలు ఉన్నప్పటికీ, అందులో ఎక్కువగా యాదవ సామాజిక వర్గం ఉండడంతో, ఎన్నికల్లో కొన్నిచోట్ల చక్రం తిప్పే యాదవ కులానికి ఓటు బ్యాంకుగా ఎన్నికల వరకే వాడుకొని.. తరువాత కరేపాకుగా కొన్ని రాజకీయ పార్టీలు వదిలేస్తున్నాయి. యాదవులు సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్ లో దాదాపు 70 లక్షల జనాభా కలిగి ఉన్నప్పటికీ, జనాభా దామాషా పద్ధతిలో వారికి తగ్గ సామాజిక న్యాయం జరగడం లేదన్న విమర్శలు లేకపోలేదు. ప్రధానంగా రాష్ట్రంలో యాదవులకు రాజకీయ ప్రాతినిధ్యం తక్కువగా ఉండేది. ఇటీవల కాలంలో తమ హక్కుల కోసం యాదవులు పోరాడుతున్నారు. ఈ నేపద్యంలో కొన్ని రాజకీయ పార్టీలు వారిని గుర్తించడం మొదలు పెట్టాయి. యాదవులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ రాజకీయాల్లో వారికి తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని, ప్రధాన పార్టీలు కమ్మ, రెడ్డి, కాపు, బలిజ, వెలమ వంటి ఇతర వర్గాలకే రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తూ.. యాదవులను విస్మరించారన్న ఆరోపణలు లేకపోలేదు. యాదవులు చారిత్రాత్మకంగా, సామాజికంగా.. క్రియాశీలకంగా ఉన్నప్పటికీ, రాజకీయ అధికారాన్ని సంపాదించడంలో వెనుకబడిపోయారు. యాదవ సామాజిక వర్గంలో చాలా ఉప కులాల విభజన ఉండడం, వారి సంఖ్య బలం ఉన్నప్పటికీ, ఏకీకృత రాజకీయ శక్తిగా ఎదగలేకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. అంతేగాక చాలామంది యాదవులు ఆర్థికంగా వెనుకబడి ఉండడం, విద్య, వ్యాపార రంగాలలో వీరికి సరైన ప్రోత్సహం లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో యాదవులకు రాజకీయ అవగాహన తక్కువగా ఉండడం, నాయకత్వ లోపం లేకపోలేదు. గడచిన రెండు సారత్విక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు విషయానికి వస్తే.. కులాల వారీగా ఓట్లు వేటను నాడు ఆరంభించాయి. ఒకప్పుడు బీసీలకు ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ తరపున ప్రోత్సహించగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కూడా బీసీలను రాజకీయంగా ప్రోత్సహించారు. వైఎస్ఆర్సిపి అధికారంలోకి రాక మునుపు అనూహ్యంగా బీసీలపై ఆ పార్టీ పెద్ద ఫోకస్ పెట్టింది. తర్వాత ఎన్నికల్లో వైయస్సార్సీపి అధికారంలోకి వచ్చింది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మళ్లీ బీసీల జపం చేయడంతో అనూహ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రా గలిగింది. అధికారంలోకి వచ్చాక ప్రధానంగా యాదవ సామాజిక వర్గానికి అనుకున్నంతగా కూటమి ప్రభుత్వం రాజ్యాధికారంలో కీలక భాగస్వామ్యం కల్పించలేకపోయిందన్న విమర్శలు లేకపోలేదు. ఇటీవల కాలంలో యాదవుల్లో రాజకీయ చైతన్యం పెంచడంతోపాటు వారి హక్కుల కోసం కొన్ని యాదవ సంఘాలు పోరాడుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో సీట్లు కేటాయింపు పై డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కొన్ని రాజకీయ పార్టీలు కూడా యాదవుల్ని గుర్తించడం మొదలు పెట్టాయి. రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో యాదవులకు తమ సంఖ్యా బలానికి అనుగుణంగా రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. 2029 ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర రాజకీయ పదవుల్లో యాదవులకు తగినంత వాటా ఇవ్వాలని యాదవ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలతో సహా అన్ని ఎన్నికలలో యాదవులకు సీట్లు కేటాయించాలని ఆ సామాజిక వర్గం పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో యాదవ సామాజిక వర్గం సామాజిక ఆర్థిక స్థితిగతులు దయనీయంగా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా విషయానికి వస్తే ఒకసారి భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావు కు టికెట్ ఇచ్చింది. అయితే ఆ ఎన్నికల్లో ఆయన గెలవలేదు. వైయస్సార్సీపీలో కూడా నర్తు రామారావుకు టికెట్ లభించినప్పటికీ ఆయన ఓడిపోయారు. తర్వాత రోజుల్లో వైయస్సార్సీపి అధిష్టానం అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి నర్తు రామారావు యాదవ్ ను దించగా, ఆయన విజయం సాధించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 19 నెలలు గడిచినప్పటికీ, శ్రీకాకుళం జిల్లాలో యాదవులకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించకపోవడం పట్ల యాదవులు అసంతృప్తిగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి కొన్ని పర్యాయాలు యాదవులు ఓట్లు వేసినప్పటికీ, వారికి తగ్గట్లు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించకుండా ఇతర సామాజిక వర్గాలకు వివిధ పదవులు పంపకంలో పెద్ద పీట వేసి యాదవులకు మొండి చెయ్యి చూపించారు. శ్రీకాకుళం జిల్లాలో కళింగ, కాపు, వెలమ సామాజిక వర్గాల తోపాటు నాలుగో ప్రాధాన్యత సామాజిక వర్గంగా ఉన్న యాదవులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించకుండా కొన్ని రాజకీయ పార్టీలు విస్మరించిన తీరుపై యాదవులు మేథో మదనం చేస్తున్నారు. భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల విషయానికి వస్తే జిల్లా పరిషత్ పరిషత్ చైర్మన్ పీఠం యాదవులకు ఇవ్వాలని, లేకపోతే 2029 ఎన్నికల్లో ఇచ్ఛాపురం గాని, టెక్కలి అసెంబ్లీ స్థానాలు యాదవులకు కేటాయించాలని, లేకపోతే శ్రీకాకుళం పార్లమెంటరీ స్థానం యాదవులకు కేటాయించాలని ఆ సామాజిక వర్గం ప్రతినిధులైన లాకా వెంగళరావు, నర్తు నరేంద్ర యాదవ్, గద్దిబోయిన గురునాథ్ యాదవ్, ఉలాల బాలయ్య యాదవ్, అందాల శేషగిరి యాదవ్, డొక్కరి దానయ్య యాదవ్ తదితర పెద్దలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. మరి వీరి కలలు నెరవేరుతాయో లేదో వేచి చూద్దాం..!

టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్ కు సన్మానం

విశాలాంధ్ర – కొత్తూరు: తెలుగుదేశం జిల్లా కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఎన్నికైన కొత్తూరు పి. ఏ. సి ఎస్ మాజీ చైర్మన్ ఆగత మూడీ అరుణ్ కుమార్ ను మండల టీడీపీ క్యేడర్ ఆదివారం ఇక్కడ టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం లో ఘనంగా సన్మానించింది టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు ఆగత మూడీ మాధవ్ రావు అధ్యక్షత న జరిగిన ఈ సన్మాన సభ లో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్ కుమార్ కు బొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానం చేసి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షులు మాధవ్ రావు , సీనియర్ టీడీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ ఆగత మూడీ భైరగి నాయుడు,ఏ. ఏం. సి మాజీ చైర్మన్ గోగుల మాధవి వర ప్రసాద్ నాయుడు, టీడీపీ స్థానిక నాయుకులు టి. తిరుపతి రావు, నూలు వీరబాద్ర స్వామి, ఎద్దు సంతోష్, కొమరాపు వెంకటరావు,, వై. కన్నం నాయుడు తదితరులు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల ముందు గా ఉన్నాయి వాటి నాన్నింటి లో టీడీపీ అభ్యర్థులే విజయం సాదించాలి ఇప్పటి నుండే గ్రామాల్లో ప్రజలు తో మనం మమేకం కావాలీ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సామాన్యులు కు చేర్చే విధంగా టీడీపీ క్యేడర్ పనిచెయ్యాలి అని ఈ సభ లో మాట్లాడి న వక్తలు అభి ప్రయపడ్డారు కాగా ఈ సభ లో టీడీపీ నేత హంస గ్రామ మాజీ సర్పంచ్ కొమరాపు వెంకటరావు తన ప్రసంగం లో టీడీపీ పార్టీ లో స్థానికం గా వర్గ విభేదాలు న్నాయి వాటిని మండల టీడీపీ కొత్త కమిటీ నాయుకులు. ఏ మ్మెల్యే మామిడి గోవిందా రావు లు సమన్వయము పరచి అందర్ని కలుపుకు ముందు కు పోవాలి అని అంటూ ఇక్కడ టీడీపీ లో ఉన్న వర్గాలు ను లేవనెత్తారు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర–మందస: గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవా దృక్పథంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణ వల్ల పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. ఆదివారం మందస మండలం హరిపురం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన స్త్రీ వ్యాధుల నివారణ ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ స్థానిక లైన్స్ క్లబ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజల మన్ననలను పొందయని పేద ప్రజల కోసం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు వల్ల పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది లైన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరణ కోసం కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో వందలాదిమంది స్త్రీలకు స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ రాజేంద్రప్రసాద్ వైద్య పరీక్షలు నిర్వహించారు వైద్య సలహాలు వారికి అందించారు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు మెరుగైన వైద్య సాయం కోసం కొంతమంది మహిళ లను ఎంపీ చేసి దీర్ఘకాలిక వైద్య సహాయం అందించడానికి భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిధులు మార్పు వెంకటేశం బైరిశెట్టి గున్నయ్య పుల్ల వాసుదేవరావు కొర్ల కన్నారావు స్థానిక ప్రముఖులు కొత్ర రామారావు కొత్ర ఆనందరావు కే వైకుంఠరావు కే హరినారాయణ తోపాటు స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆవిష్కర్ హ్యాక్‌థాన్ సీజన్-3 కొనసాగింపు

విశాలాంధ్ర–టెక్కలి: మండలంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆవిష్కర్ హ్యాక్‌థాన్ సీజన్–3 కార్యక్రమం రెండవ రోజు ఉత్సాహంగా కొనసాగింది. ఈ హ్యాక్‌థాన్‌లో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. రెండవ రోజు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి బృందాలు వాస్తవ జీవిత సమస్యలకు వినూత్న సాంకేతిక పరిష్కారాలను రూపొందించడంపై దృష్టి సారించాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వెబ్ మరియు యాప్ అభివృద్ధి, ఐఓటి, డేటా సైన్స్, సామాజిక సమస్యల పరిష్కారాలు వంటి అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాల అధ్యాపకులు మరియు నిపుణులైన మెంటర్లు విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తూ వారి ఆలోచనలకు మరింత మెరుగుదలలు సూచించారు. ఈ హ్యాక్‌థాన్ ద్వారా విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచన, బృందపని నైపుణ్యం, సమస్య పరిష్కార సామర్థ్యం పెరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులను భవిష్యత్తు సాంకేతిక సవాళ్లకు సిద్ధం చేయడంలో కీలకంగా నిలుస్తుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. హ్యాక్‌థాన్ చివరి రోజున సోమవారం, ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి విజేతలకు బహుమతులు మరియు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

మెట్టూరు బిట్ 1 లో శానిటేషన్ పనులు

విశాలాంధ్ర – కొత్తూరు : మండలం మెట్టూరు బిట్టు వన్ (కృష్ణాపురం) గ్రామం లో శానిటేషన్ పనులు గత మూడు రోజులుగా సాగుతున్నాయి పరిసరాలు శుభ్రత కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ శంకర్ రావు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదపాక శంకర్రావు కూటమి నాయకులు బర్రి గోవిందరావు బర్రి మోహన్రావు బర్రి షణ్ముఖరావు ఎంపీటీసీ ఎక్స్ బలవంతల తిరుపతిరావు మరియు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగినది

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర–సోంపేట : సోంపేట మండలం తాళ్లబద్ర రాణిగం గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి యజ్ఞేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. హరిపురం సబ్ స్టేషన్ పరిధిలో అంబుగాం ఫీడర్ పై ఆర్ డి ఎస్ ఎస్ వర్క్ జరగనున్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర–శ్రీకాకుళం: నేడు(సోమవారం) ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ లో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నేరుగా పై కార్యక్రమములో లేదా ఆన్లైన్ లో (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100లి (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టాలెంటు టెస్ట్‌కు విశేష స్పందన



విశాలాంధ్ర–కవిటి: కవిటిలోని (కే కొత్తూరు) శ్రీ కళ్యాణీ జూనియర్ కళాశాలలో ఆదివారం పదివ తరగతి విద్యార్థులకు టాలెంటు టెస్టు నిర్వహించారు. ఇందులో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు హాజరైనారు.వీరంతా వారి ప్రతిభను పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకరరావు మాట్లాడుతూ టాలెంటు టెస్ట్ వలనే విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ బయటకు వస్తుందని, దీనికి సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులందరికీ ధన్యావాదాలు తెలిపారు. అలాగే పరీక్ష ఫలితాలను త్వరలో ప్రకటించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర–కవిటి: కవిటి మండలం బొరివంక సబ్స్టేషన్ పరిధిలో 11కేవీ, ఆర్డిఎస్ఎస్ పనులు చేయు నిమిత్తం మంగళవారం సబ్డేస్టేషన్ పరిధిలో గల బొరివంక, బెజ్జిపుట్టుగ,పిరియావీధి, బార్లవీధి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్తుశాఖ ఈఈ జి. యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.గృహ,వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.